# మినీకథలు

## రెండు నోటు

మురారి దుర్గాప్రసాద్



ఆ రోజు అర్జంటుగా ఆఫీస్ పనిమీద బ్రీఫ్ కేస్‌లో ఓ జత బట్టలు కుక్కుకొని విజయవాడ బయలుదేరాను. అక్కడ ఆఫీసులో అడుగుపెట్టేసరికి కన్‌సర్న్డ్ క్లర్క్ సీటు ఖాళీగా వెక్కిరించింది నన్ను. తమాయించుకున్నాను. ఏమిటి సమాచారం అని ప్రక్కవాళ్ళను ఆరాతీస్తే ప్రొద్దున శెలవు పెట్టినట్లుగా చెప్పేసరికి నీరుగారి, మళ్ళీ మధ్యాహ్నం ఆఫీసుకి వస్తాడని తెలిసేసరికి ఊపిరివచ్చినట్లుగాఫీలయ్యాను.మధ్యాహ్నం దాకా వెయిట్ చేయాలి ఎలాగా అని వాచీ చూచుకొన్నాను. పదిగంటలయింది. దగ్గర్లో వున్న హోటల్లో దూరాను. బిల్ తెచ్చి కౌంటర్‌లో ఇచ్చాను పదినోటుతో. సదరు హోటల్ యజమాని చిల్లరఇస్తూ, మామూలు చిల్లరనోట్ల బంచ్‌లో నుంచి రెండు రూపాయల నోట్లు రెండు తీసి, మూడవ రెండు మాత్రము డ్రాయర్లో ఒక ప్రక్కనుంచి తీసి మొత్తము ఆరు రూపాయలు ఇచ్చాడు. మూడో రెండునోటు చూడగానే అది యెందుకు డ్రాయర్లో స్పెషల్‌గా చోటు చేసుకుందో అర్థమయింది.

నోటు మురికిగావుంది చిల్లులతో.

ఎంతమందికి అంటగట్టడానికి ప్రయత్నిస్తున్నాడో, వాళ్ళు వద్దంటే మళ్ళీ తిరిగి షెల్ఫ్‌లో స్పెషల్‌గా ఓ ప్రత్యేకమయిన చోట పెడుతున్నాడు కాబోలు మరొకళ్ళకు ఈజీగా అంటగట్టడానికి అనుకున్నాను.

సహజంగా తొందరపడి ఏదీ రిజెక్ట్ చేసే మనస్తత్వం కానందువలన యెక్కడోచోట మారక పోతుందా అని జేబులో వేసుకున్నాను. అతను రిలాక్స్ అయినట్టు తోచింది నాకు. ఏం చేయాలో తోచలేదు. దగ్గర్లోవున్న థియేటర్‌కు మార్నింగ్‌షోకు వెళ్ళాను. కౌంటర్‌లో ఒకరెండు పాతది, ఒకరెండు క్రొత్తది మొత్తం నాలుగు రూపాయిలిచ్చి టికెట్ యిమ్మన్నాను. వాడు పాతనోటుని శల్యపరీక్షచేసి “లాభంలేదు మరొక నోటివ్వండి” అన్నాడు.

బయటకొచ్చి లెవల్‌గా గోల్డుస్పాట్ త్రాగి పాత రెండు కాగితమిచ్చాను. వాడు పెదవి విరిచి మరొకటిమ్మన్నాడు. దగ్గర

“హరి రాస్కెల్” అనుకొని మరొకటిచ్చాను.

సినిమాలో గ్రూప్‌సాంగ్‌లో ఎక్స్‌ట్రాల కన్నా హీరోయిన్‌ని అందంగా చూపెట్టడానికి సినిమావాళ్ళు పడిన పాట్లకు జాలేసింది. పిక్చర్ అయిందనిపించాను.

## ఓ సీటు కథ

వై. పార్థసారథి



మా వూళ్ళో వున్న థియేటర్లోకి ఆ రోజే క్రొత్త సినిమా రావడంతో జరుగుతున్న క్లాస్ ఎగ్గొట్టి వచ్చి బుకింగ్‌లో నిలబడ్డాను. రాను రాను “క్యూ” పెరుగుతోంది. క్లాస్ అయిన తర్వాత కాలేజీ ఎగ్గొట్టి వచ్చిన ఆడపిల్లల గ్రూప్ నిరాశగా లైను వైపు చూస్తున్నారు. వాళ్ళు నా వైపు చూడగానే పళ్ళికిలించాను. వెంటనే మా క్లాస్‌మేట్ లతామణి వచ్చి “మాక్కూడా ఓ రెండు టిక్కెట్లు తెచ్చివ్వరూ—ప్లీజ్” అంది. టిక్కెట్లుసాధించి విజయ గర్వంతో కాలర్ సవరించుకొని తెచ్చాను.

సినిమా ఆరంభం అయేముందు లోపలికి దూరాను. అంతా అప్పటికే నిండిపోయి వుంది. సీట్లు వెతుకుతూ తిరుగుతున్నాను. ఓ ఇద్దరిమధ్య ఖాళీసీటు కనిపించింది. వెళ్ళి కూర్చోబోయాను.ఇద్దరూ కలిసి ప్రక్కకు నెట్టారు. “మా వాళ్ళు వచ్చేదుంది” అంటూ కర్కశంగా వినపడింది.

వాళ్ళ ప్లాన్ నా కర్థమయింది. అంతా నిండాక యెవరైనా అమ్మాయి వస్తే సీటిచ్చి ఫోజులు పెట్టడానికి అని అర్థం చేసుకొన్నాను.

గబగబా ముందువరసలోకెళ్ళి లత మణితో ఈ విషయం చెప్పి ఆమెను పంపించాను.

లత వాళ్ళ దగ్గరకెళ్ళి “ఏమండీ ఈ సీటు ఖాళీయా” అంది కూర్చోబోయే దానిలా.

వాళ్ళిద్దరూ “అవును కూర్చోండి” అన్నారు ఆమెవైపు ఆశగా చూస్తూ.

వెంటనే లత “హరీ సీటు ఖాళీదట” అంటూ నన్ను పిలిచింది.

విజయగర్వంతో ఆ సీట్లో కూర్చుంటూ వాళ్ళవైపు చూశాను. సీటుకున్న నల్లరంగు తో వాళ్ళ ముఖం పోల్చడానికి ఓ క్షణం పట్టింది నాకు.